

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అలంపూర్ ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



కేంద్ర బృందం పర్యటన

మూసాపేట, రాజాపూర్ మండలాల్లో కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటించింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /19.0

ఉదయం శీతల గాలులు వీచే అవకాశం ఉంది. రోజంతా వాతావరణం సాధారణంగా.. మధ్యాహ్నం ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

'పేట' వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు శనివారం నుంచి సోమవారం వరకు మూడురోజుల పాటు మూసి ఉంటుందని మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం శివరాత్రి, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం అమావాస్య కావడంతో క్రయ విక్రయాలు జరగవని.. మంగళవారం నుంచి లావాదేవీలు కొనసాగుతాయని, రైతులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

తెల్ల కందులు క్వింటా రూ.8,115..
జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం తెల్లకందులు క్వింటా గరిష్టంగా రూ.8,115, కనిష్టంగా రూ.7,900 ధర పలికింది. ఎర్ర కందులు రూ. 8,009–రూ.7,649, వేరుశనగ రూ. 7,609 – రూ. 3,839, శనగలు గరిష్టంగా రూ.4,803, కనిష్టంగా రూ.4,739 ధరలు లభించాయి. జిల్లాలోని కాటన్‌మిల్లులో పత్తి క్వింటా గరిష్టంగా రూ.7,900, కనిష్టంగా రూ.4,500 ధర పలికింది.

వేరుశనగ క్వింటా రూ.8,370

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగకి గరిష్టంగా రూ.8,370, కనిష్టంగా రూ.4,369 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు రూ.2,180, కందులు గరిష్టంగా రూ.7,668, కనిష్టంగా రూ.7,359, పెబ్బర్లు గరిష్టంగా రూ.6,187, కనిష్టంగా రూ.6100 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,612, కనిష్టంగా రూ.6,572 ధరలు నమోదయ్యాయి.

విద్యార్థులకు సౌకర్యంగా భవనాలు

మరికల్: మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలకు అద్దెకు ఇచ్చిన భవనం విద్యార్థులకు సౌకర్యంగా ఉండాలని జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి కృష్ణమాచారి అన్నారు. నారాయణపేటకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాల మరికల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కొనసాగుతోంది. ఆ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన కృష్ణమాచారి మరిన్ని మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్టీ డిగ్రీ గురుకులాలలో గెస్ట్ లెక్చరర్ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్సీఓ నాగార్జున్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పీజీ, నెట్, సెట్ ఉన్న వారు తిరుమలహిల్స్‌లోని గురుకులాలో ఈనెల 22 లోగా దరఖాస్తు సమర్పించాలని, 23న డెమో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆశ.. నిరాశలో పత్తిరైతు



అప్పుల బాధకు తక్కువ ధరలకే విక్రయిస్తున్న రైతులు

- చాలామంది ఇళ్లలోనే పత్తి నిల్వలు
- తగ్గిన ధర పెరుగుతుందని ఎదురుచూపులు
- రోజురోజుకూ తప్పని అప్పులోళ్ల బాధలు



మరికల్‌లో ఓ ఇంట్లో నిల్వ చేసిన పత్తిని చూపిస్తున్న రైతు

మరికల్: రూ.9600, రూ.8,500, రూ.8,000, రూ.7,800 ఇవి అంకెలు కావు.. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు నెలనెలా తగ్గిన పత్తి ధరలు. మళ్లీ ధర పెరిగితే విక్రయిద్దామని పత్తిని చాలామంది రైతులు ఇళ్లలోనే దాచుకున్నారు. నిత్యం మంచిధర కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులోళ్ల బాధ ఉన్నా కాస్త ఓపిక పడితే మళ్లీ పెరుగుతుందేమోనని ఆశ పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొందరు రైతులు వచ్చిన ధరకే విక్రయిస్తున్నారు.

జిల్లాలో 2లక్షల ఎకరాల్లో సాగు..
గతేడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 2,05,607 ఎకరాల్లో పత్తిపంటను సాగు చేశారు. దాదాపు 18 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. 2021లో ప్రారంభ దశలో పత్తి ధర క్వింటాల్ రూ.6వేల నుంచి రూ.15వేల మార్కు దాటింది. అదే ఆశతో 2022లో రికార్డు స్థాయిలో 2లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఎకరాకు కేవలం 5క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు పెరిగే ధరలపై ఆశ పెట్టుకున్నారు. కానీ ప్రారంభంలో క్వింటా రూ.8వేలు పలకడంతో ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉందని రైతులు మార్కెట్లో పత్తిని విక్రయించకుండా ఇంట్లోనే నిల్వ చేశారు. నవంబర్‌లో క్వింటా రూ.9,600కు చేరిన అమ్మలేదు. ఇంకా అక్కడి నుంచి నెలనెలా పత్తి ధర పతనం అవుతోంది తప్పా పెరిగింది లేదు. జిల్లాలో 4 జిన్నింగ్ మిల్లులు ఉన్నా.. ఎక్కడా అమ్మకాలు ఊపందుకోలేదు.

రెండేళ్లుగా పత్తి ధరలు ఇలా..

నెల	2021లో	2022లో
అక్టోబర్	రూ.6,500	రూ.7,500
నవంబర్	రూ.8,600	రూ.9,600
డిసెంబర్	రూ.9,200	రూ.8,500
జనవరి (2022)	రూ.9,800	రూ. 8,000 (2023)
ఫిబ్రవరి	రూ.10,200	రూ.7,800

పత్తి నిల్వలతో అనారోగ్యం..
జిల్లాలో పత్తి రైతు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. గిట్టుబాటు ధర లేక పత్తిని ఇంట్లోనే నిల్వ చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నాలుగు నెలలుగా ఇంట్లోనే పత్తిని ఉంచుతుండటంతో నల్ల పురుగు తయారవుతోంది. చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ దురద, దద్దుర్లు వస్తున్నాయి. మరికొందరికి కురుపులు ఏర్పడుతున్నాయి. ఒళ్లంత మచ్చలు వస్తున్నాయి. పత్తి నుంచి వచ్చే దుమ్ము, ధూళిని పీలుస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. రాత్రివేళ నిద్ర పట్టడం లేదు.

పత్తి ధరలు పెంచాలి



నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ధర పెరుగుతుందనే ఆశతో ఇంటి ఆవరణలో 80 బస్తాల పత్తి నిల్వ చేశాను. నాలుగు నెలల నుంచి ధర కోసం ఎదురుచూస్తున్నాం. కానీ పెరగడం లేదు. నిల్వ చేసిన దగ్గరనే పత్తి బరువు కూడా తగ్గుతోంది. రైతుల కష్టాలను చూసైనా క్వింటాల్ పత్తి ధర రూ.10 వేలకు పెంచాలి. లేదంటే నష్టాలు చావిచూడక తప్పదు.

– అనంత్‌రెడ్డి, రైతు, మరికల్

దురద పెడుతోంది..



ధర కోసం ఇంట్లో పత్తిన్ని నిల్వ చేయడం వల్ల నెలరోజుల నుంచి పత్తిలో నుంచి నల్ల పురుగులు రావడంతో దురద, దద్దుర్లు పెడుతోంది. పిల్లలకు అనారోగ్యంబారిన పడుతున్నారు. మా ఇబ్బందిని అర్థం చేసుకొని, పత్తి ధర పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకుంటే పంటలకు పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడుతుంది.

– మాసప్ప, కౌలురైతు, హరిజన్ నగర్

అప్పులోళ్ల బాధ..

పత్తి రైతులు పలుచోట్ల వ్యాపారుల వద్దే విత్తనాలు, రసాయన ఎరువులు ఉద్దెరకు తీసుకొచ్చారు. కూలీ ల కోసం ప్రైవేట్ అప్పులు చేశారు. ఈ సమయంలో రైతులు ఆ వ్యాపారులకే విక్రయిస్తామని ఒ ప్పందాలు చేసుకున్నారు. వచ్చిన దిగుబడిని ప్రస్తుతం ఉన్న ధరలకు విక్రయిస్తే వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులకు కూడా సరిపోని పరిస్థితి. మంచి ధర కోసం నాలుగు నెలలుగా ఇళ్లలోని భద్రపరచుకున్న అప్పుళ్లోల బాధలు తట్టుకోలేక తక్కు వ ధరకే అమ్మేయాల్సి వస్తోందని అంటున్నారు. చేసిన కష్టానికి ఫలితం లేక దిగాలు పడుతున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



కృష్ణానది తీరాన దత్తక్షేత్రం.. దత్తాత్రేయస్వామి మూల విగ్రహం

నేడు వల్లభాపురంలో రథోత్సవం

మక్తల్: మండలంలోని వల్లభాపురం దత్తక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పవిత్ర కృష్ణానది తీరాన జగద్గురు దత్తాత్రేయస్వామి కొలువుదీరారు. మహాశివరాత్రి రోజున రథోత్సవం, 19న శివపార్వతుల కల్యాణం, 21న రేణుకామాత బోనాలు ఉంటాయని దత్త పీఠాధిపతి, నిర్వాహకులు, ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం అర్చన, మహానివేదన, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం కృష్ణానది జల సేకరణ, మహా రుద్రాభిషేకం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, సహస్ర దీపాలంకరణ, అభిషేకం, అన్నమయ్య సంకీర్తనలు, రాత్రి 8 గంటలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 21న రేణుకామాత బోనాల ఉత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా మక్తల్ నుంచి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



విద్యుద్దీపాల అలంకరణలో సింగార్‌బేస్ శివలింగేశ్వరస్వామి మఠం

నారాయణపేట టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని బారంబావి శివాలయం, అంబన్నబావి వద్ద అమరేశ్వర ఆలయం, గాంధీనగర్‌లోని లింగయ్యస్వామి, అమరేశ్వరాలయం, బాహర్‌పేటలోని నీలకంఠేశ్వరస్వామి, సుభాష్‌రోడ్‌లోని భక్త మార్కండేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి, సింగార్‌బేస్‌లోని శివలింగేశ్వర మఠంతో పాటు పలు శివాలయాలను శుక్రవారం రంగురంగుల విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు. ప్రత్యేక పూజలు, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: రాబోయే వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఉన్న పంపులు, మోటార్ల వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. మెయిన్, సెకండరీ పైప్‌లైన్‌లో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేసేలా బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంచాలన్నారు. మద్దూర్‌లో లోఓల్టేజీ సమస్యతో కొందరు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చిత్తశుద్ధి ఉంటే డీపీఆర్ చూపించాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

నారాయణపేట: అన్ని చేశా.. సాగునీరు తెచ్చి రైతుల కాళ్లు కడుగడమే ధ్యేయమని చెబుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే డీపీఆర్ చూపించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ ప్రశ్నించారు. శుక్రవారం కేపీఆర్ అతిథిగృహంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్, ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీపీఆర్ లేకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారని నిలదీశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో జిల్లాకు ఒరిగేది ఏమీ లేదని.. చుక్క నీరు రాదని తెలంగాణ ఇంజినీర్ల ఫోరం 2016, జూన్ 15నే సీఎం ముందు కుండబద్దలు కొట్టిందని వివరించారు. కేవలం జీఓనంబర్ 69 ద్వారా నికర జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేయాలని కోరినట్లు తెలిపారు. అయినప్పటికి ఎమ్మెల్యే పాలమూరు రంగారెడ్డి ద్వారా నీళ్లు తెస్తానని జిల్లా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 69 జీఓ అమలుకు అఖిల పక్షాలు ఉద్యమించాయని.. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. అలాగే 20, ఫిబ్రవరి 2022న కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ చేపడతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారని.. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూసేకరణ, రాష్ట్ర వాటా చెల్లించకుండా తొక్కి పెడుతోందని వివరించారు. చిత్తశుద్ధి ఉంటే శంకుస్థాపన రాళ్లు వేయకుండా సిరిసిల్ల, సిద్దిపేట మాదిరిగా అభివృద్ధి చేసి చూపాలని డిమాండ్ చేశారు.

మిత్తి ఇస్తానని ముంచేశాడు

- సుమారు వెయ్యి మందికి రూ.20 కోట్లకు పైగా టోకరా
- ముంపు బాధితులను మోసం చేసిన వడ్డీ వ్యాపారి

గోపాల్‌పేట (రేవల్లి): ఓవైపు ప్రాజెక్టు కోసం ఇళ్లు, పొలాలు కోల్పోయిన వారిని నమ్మించి మోసం చేశాడో ప్రబుద్ధుడు. అధిక మిత్తి ఆశజూపి.. అమాయకుల నుంచి డబ్బులు తీసుకుని మరోసారి నిండా ముంచేశాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్‌కు చెందిన సాయిబాబు సుమారు 2011 సంవత్సరం నుంచి నాగపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వడ్డీలకు డబ్బులు ఇచ్చేవాడు. ఈ క్రమంలో 2016 ప్రాంతంలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్ ముంపు గ్రామాలైన బండరావిపాకుల, కొంకలపల్లి, ఏదుల గ్రామాల పరిధిలోని రైతులకు భూమి పరిహారంగా డబ్బులు వచ్చాయి. దీంతో అప్పటికే మిత్తిలకు డబ్బులు ఇస్తున్న సాయిబాబు తనకు డబ్బులు ఇస్తే.. ప్రతినెలా రూ.2 వడ్డీతో చెల్లిస్తానని నమ్మించాడు. ఇలా కొంత మంది రూ.లక్షల్లో డబ్బులు అతనికి ఇచ్చారు. మొదట్లో అందరికీ మిత్తి డబ్బులు సక్రమంగా చెల్లించాడు. ఆ తర్వాత కొంకలపల్లి, బండరావిపాకుల గ్రామస్తులకు సైతం పునరావాసం డబ్బులు ఎక్కువ మొత్తంలో రావడంతో వారు సైతం సాయిబాబుకు ఇచ్చారు. ఇలా సుమారు వెయ్యి మంది వద్ద రూ.20 కోట్లకు పైగా అప్పుగా తీసుకున్నాడు. అయితే ఏడాది నుంచి సాయిబాబు డబ్బులు సరిగా ఇవ్వకపోవడంతో మూడు గ్రామాల ప్రజలకు అనుమానం వచ్చి నిలదీశారు. దీంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఆస్తులు ఉన్నాయని, వాటిని అమ్మి డబ్బులు చెల్లిస్తానని చెప్పారు. రెండు నెలల క్రితం సాయిబాబు స్వగ్రామం నాగపూర్‌కు వచ్చి మరోసారి నిలదీశారు. దీంతో అతడు కొన్ని నెలలు సమయం కావాలని ఆలోగా అందరి డబ్బులు చెల్లిస్తానని చెప్పుకొచ్చినా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సైతం సాయిబాబు బాధితులు ఉన్నట్లుగా తెలుస్తోంది. పెద్దకొత్తపల్లి, కోడేరు, గుడిపల్లి, నాగర్‌కర్నూల్‌లో కొందరు సాయిబాబుకు డబ్బులు ఇచ్చినట్లు సమాచారం.

మంత్రి వద్దకు పంచాయితీ
తమను మోసం చేసి డబ్బులు ఇవ్వడం లేదని బండరావిపాకుల, కొంకలపల్లి, నాగర్‌కర్నూల్‌కు చెందిన కొందరు రైతులు రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని కలిసి వారి గోడును చెప్పుకొన్నారు. వెంటనే స్పందించిన మంత్రి నాగర్‌కర్నూల్ ఎస్పీతో మాట్లాడి కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించినట్లు తెలిసింది.

అటకెక్కిన చదువులు!

సమీపిస్తున్న పదోతరగతి వార్షిక పరీక్షలు

- చాలా పాఠశాలల్లో పూర్తికాని పాఠ్యాంశాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల బిజీలో ఉపాధ్యాయులు.. ఆందోళనలో తల్లిదండ్రులు

మద్దూరు మండలం పల్లెర్ల పాఠశాల 2015లో అప్‌గ్రేడ్ కాగా.. అప్పటి నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతుంది. అయితే నాటి నుంచి గణితం, భౌతిక, రసాయన శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేరు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే డిప్యుటేషన్‌పై గణితం ఉపాధ్యాయుడిని మూడునెలల క్రితం పంపించారు. భౌతిక, రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడు లేకపోవడంతో పంచాయతీ నుంచి ఉపాధ్యాయుడిని నియమించారు. కొన్ని రోజులు బోధించి తర్వాత మానేశారు. మండలంలో అప్‌గ్రేడ్ అయిన దోరేపల్లి, కొమ్మూరు, రెనివట్ల, మోమినాపూర్ పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ప్రధాన సబెక్టుల ఉపాధ్యాయుల కొరత ఓవైపు ఉంటే.. ఎమ్మెల్సీ ఎన్నికలు, పదోన్నతులు, బదిలీల పేరిట కొంతకాలంగా ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నెల 22 నుంచి ప్రీఫైనల్ ఎగ్జామ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



మద్దూరు మండలం పల్లెర్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బోధన (ఫైల్)

మద్దూరు: పదోతరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికీ మెజార్టీ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాలు పూర్తి కాలేదు. పునశ్చరణ తరగతులు కొన్నిచోట్ల మొదలుకాగా.. మరికొన్ని పాఠశాలల్లో పూర్తికాని సిలబస్ చెప్పే పనిలో ఉపాధ్యాయులు ఉన్నారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు వారిలో మానసిక స్థైర్యం నింపాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉంది. కీలకమైన వార్షిక పరీక్షల సమయంలో బదిలీలు, పదోన్నతులంటూ ప్రభుత్వం ఆశ కల్పించడం, ఇప్పుడే ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో కొంతకాలంగా ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో నేటికీ కొన్ని పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల సిలబస్ పూర్తి కాలేదు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే కసరత్తు చేయాల్సిన సమయంలో కొందరు ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగిపోవడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో 12 వేల మంది విద్యార్థులు..
జిల్లాలోని 13 మండలాల్లో కేజీవీబీలు, ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు అన్ని కలిపి 102 ఉన్నాయి. వాటిలో 9, 10వ తరగతి విద్యార్థులు దాదాపు 12 వేల మంది ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా మెజార్టీ పాఠశాలల్లో నేటికీ ప్రధాన సబెక్టుల సిలబస్ పూర్తి కాలేదు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో సిలబస్ పూర్తయినట్లు తెలుస్తోంది. చాలావరకు అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో పోస్టులు ఖాళీ ఉండటంతో సిలబస్ పూర్తి కాలేదు. దీనికి తోడు భాష ఉపాధ్యాయులు ఈ నెల 1 నుంచి 9, 10 తరగతులకు బోధన చేయకుండా సహాయ నిరాకరణ చేపట్టారు. ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రీఫైనల్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఏప్రిల్‌లో వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు బిజీబిజీ..
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ పరిధిలో 33,116 మంది ఓటర్లు ఉన్నట్లు అంచనా. వీరిలో ఇప్పటి వరకు 29 వేల మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాల నుంచి సీనియర్ లీడర్లు బరిలోకి దిగారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ అభ్యర్థి గెలుపునకు ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజుకు కనీసం అయిదు, ఆరు పాఠశాలలను చుట్టేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించాల్సిన ఉపాధ్యాయులు ఎన్నికలు, బదిలీలు, పదోన్నతులంటూ తిరుగుతుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వార్షిక పరీక్షల సమయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం..



ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేస్తున్నాం. ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశించాం. కొన్నిచోట్ల సమస్య ఉన్న మాట వాస్తవం. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరిగితే కొంతమేర సమస్య తీరుతుంది.

– లియాఖత్ అలీ, జిల్లా విద్యాధికారి

ఉపాధి రంగాల్లో మహిళలకు శిక్షణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్ రంగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామని, అనంతరం కేంద్ర ప్రభుత్వం తరఫున ధ్రువపత్రం అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పద్మావతికాలనీలోని సంస్థ కార్యాలయంలో, లేదంటే 08542–273981, 9441867043 నంబర్లను ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


పుట్టరవికుమార్ (ఫైల్)

కోడేరు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పస్పులలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు పుట్ట రవి కుమార్ (32) కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఉదయం మామిడి తోటకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడ కడుపు నొప్పి రావడంతో భరించలేక పురుగు మందు తాగి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య..

బాలానగర్: ఆర్థిక ఇబ్బందులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన బిక్షపతి (40) గురువారం సాయంత్రం చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి వ్యక్తి మృతి

జడ్చర్ల: స్థానిక నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో శుక్రవారం విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. నిమ్మబాయిగడ్డకు చెందిన శ్రీశైలం(40) పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా హనుమాన్ దేవాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారిందని ఆ ప్రాంతవాసులు తెలిపారు.

కృష్ణానదిలో పడి వ్యక్తి..

దోమలపెంట: శ్రీశైలం రిజర్వాయర్ దిగువన పాతాళ గంగ వద్ద కృష్ణానదిలో పడి వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈగలపెంట ఎస్సై కృష్ణదేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బ్రహ్మయ్య(35) తన ఏడుగురు స్నేహితులతో కలిసి శ్రీశైలం దర్శనానికి వచ్చాడు. శ్రీశైలం జలాశయం దిగువన ఎడమవైపు ఉన్న పాతాళ గంగ వద్ద స్నానం చేసేందుకు కృష్ణానదిలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడంతో స్నేహితులు గాలించినా దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికి చూడగా బ్రహ్మయ్య మృతదేహం బయటపడినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపల్లి గ్రామ సమీపంలో కృష్ణానది పెదమడుగు వద్ద గుర్తు తెలియని యువకుడు (30) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సంఘటన స్థలం వద్దకు పోలీసులు చేరుకుని మృతదేహంను బయటకు తీశారు. నాలుగు రోజుల క్రితం పెదమడుగులో ప్రమాదవశాత్తు పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. యువకుడిని గుర్తు పట్టలేని విధంగా ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు పూర్తి చేస్తామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దక్షిణకాశీలో శివరాత్రి వేడుకలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ధ్వజ మండపం వద్ద గోమాతకు పూజలు చేశారు. జోగుళాంబ ఆలయానికి చేరుకుని అమ్మవారికి మంగళద్రవ్యాలు, పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి శివసంకల్పం పఠించి భలిభేరంకు త్రిశూల పూజలు చేశారు.

ఉత్సవ కోలాహలం

యాగశాలలో గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, ఋత్విక్ వరణ కార్యక్రమాలతో అర్చకులు ఆరంభ పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ముఖ్య అర్చకులు మహా సంకల్పం పఠించి ఐదు రోజులు కొనసాగే పాంచాహ్నిక దీక్ష కార్యక్రమాలను భక్తులకు వివరించారు. కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అబ్రహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాగశాలలో నవగ్రహ, క్షేత్ర పాలక, చతుషష్టి యోగిని, వాస్తు, సర్వతో భద్రభద్ర మండపం, ద్వాదశ లింగతో భద్రమండపంలను ఆవాహన చేసి ఆయా


గో సహిత ఆలయ ప్రాకారోత్సవం

దేవతలను మంత్ర పూర్వకంగా ఆహ్వానించి ప్రాణ ప్రతిష్టలు చేశారు. ఆయా దేవతలకు షోడశోపచార పూజలు చేసి బలిహరణలు సమర్పించారు.

ఆరంభ సంకేతంగా అంకురార్పణ

బ్రహ్మేశ్వర ఉదానవనంలో భూసూక్తం పఠిస్తూ పుట్టమట్టిని తీసుకుని ఆలయ ప్రదక్షిణగా ఆలయ ఈఓ యాగశాలకు మృత్తికను తీసుకొచ్చారు. అక్కడ పాలికలలో పుట్టిమట్టిని నింపి పాలల్లో తడిపిన నవధాన్యాలను మట్టితో మిళితం చేశారు. మంత్ర పూర్వక జలాన్ని అభిమంత్రిస్తూ గ్రామ, రాష్ట్ర, దేశములో వర్ష సంవృద్ధి కలగాలని అందుకు వరుణుడు సకాలంలో సహకరించాలని పూజలు చేశారు. అగ్ని ప్రతిష్టాపనతో యాగశాలలో పూర్తి స్థాయిలో దేవతా హోమాలను ప్రారంభించారు.


పుట్ట మట్టిని తీసుకొస్తున్న ఈఓ పురేందర్

ధ్వజారోహణతో దేవతాహ్వానం

ఉత్సవాలలో ప్రధాన భూమిక పోషించే దిక్పాలకులను ఆయా మంత్రాలతో భేరీ తాళనం చేస్తూ మంత్ర పూర్వకంగా ఆయా దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాగం, తాళం, వేదమంత్రాలు, సంగీతాలను పఠించారు. అనంతరం ఉత్సవాల విజయానికి సంకేతంగా నందికేతనాన్ని మంగళాష్టకాలు పఠిస్తూ ధ్వజం పైకి ఎగరవేశారు. కార్యక్రమంతో ఉత్సవాలలో ప్రధాన భూమికను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనోరమ, ధర్మకర్తలు, మున్సిపల్ కమిషనర్ నిత్యానందం, భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణలింగ అభిషేకం

మహాశివరాత్రి రోజున అలంపూర్ పుణ్యక్షేత్రంలో స్వర్ణలింగాభిషేకంకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో, చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే అబ్రహం పరిశీలించారు. మహాశివరాత్రి, మాస శివరాత్రి, శనివారం, శని త్రయోదశి , మాఘ మాసం కలసి రావడం ఎంతో విశేషమన్నారు.



బైక్ అదుపుతప్పి తండ్రి దుర్మరణం

- కుమారుడికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి స్కూటీ అదుపు తప్పి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మన్ననూర్‌కు చెందిన మహ్మద్ జాకీర్ హుస్సేన్ (35) అతని కుమారుడు అసాద్‌తో కలిసి బైక్‌పై హైదరాబాదు నుంచి వస్తుండగా మార్గమధ్యలో వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో సాంపిగుట్ట వద్ద స్కూటీ అదుపుతప్పి పడిపోయింది. దీంతో తండ్రీ, కొడుకులకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జాకీర్ హుస్సేన్ మృతి చెందగా, కొడుకు అసాద్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

బండరాయి మీద పడి యువకుడి మృతి

- జిలెటిన్ స్టిక్ పేల్చడంతో ఘటన


బాలరాజు (ఫైల్)

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లి శివారులోని గుట్టలలో శుక్రవారం సాయంత్రం రాయి మీద పడి పొక్లెయిన్ ఆపరేటర్ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుట్టలో రాళ్ల పేల్చేందుకు జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించారు. దీంతో బండ రాయి మీద పడి జేసీబీ ఆపరేటర్ బాలరాజు (28) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి దేవరకద్ర మండలంలోని నాగారం. ఈ విషయం క్రషర్ యాజమాన్యం బయటకు తెలియకుండా రాజీ కుదుర్చే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అది కుదరకపోవడంతోనే విషయం బయటకు పొక్కింది. సంఘటనపై ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని మృతి చెందిన విషయం తెలవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించిన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ఊర్కొండ: గురుకుల పాఠశాలలో చదువుతూ మండలానికి చెందిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడిగానిపల్లి చెందిన విద్యార్థి లావణ్య (13) మహబూబ్‌నగర్ జిల్లాలోని మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. వారం రోజుల కిందట నుంచి విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతుండగా, విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు విద్యార్థిని ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉందని, సమస్యలు ఉంటే తెలియజేస్తామని చెప్పటంతో తల్లిదండ్రులు ఇంటికి తిరిగి వచ్చారు. మరల గురువారం అర్ధరాత్రి విద్యార్థిని ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా, అప్పటికే విద్యార్థిని పరిస్థితి విషమించటంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు అక్కడి సిబ్బంది వారికి తెలియజేశారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లగానే విద్యార్థిని మృతి చెందిందని ఆస్పత్రి వారు సమాధానమిచ్చారు. విద్యార్థిని ఆరోగ్యం ఎందుకు విషమించిందో అన్న విషయం తల్లిదండ్రులకు పాలుపోలేదు. మృతదేహాన్ని తీసుకొచ్చి గుడిగాన్‌పల్లిలో అంత్యక్రియలు చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ లక్ష్మణ్ నాయక్‌ను వివరణ కోరగా విద్యార్థిని మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో వ్యభిచార గృహంపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ఇలా.. పట్టణంలోని భీంనగర్ కాలనీలో కర్నూల్‌కు చెందిన మహిళ ఇంటిని అద్దెకు తీసుకుని కర్నూల్‌కు చెందిన కొంత మంది మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్నారు. దీంతో సిబ్బంది సాయంతో ఆ ఇంట్లో సోదాలు చేయగా ఓ యువతి, నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కొకుంట్ల మండలం గోపనపల్లికి చెందిన ఎల్లమ్మ (44) గురువారం జడ్చర్ల కొత్త బస్టాండ్ నుంచి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఏఎస్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ముందూ నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- కుమారుడు మృతి, తండ్రి, కూతురికి గాయాలు


అఖిల్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరుకు చెందిన లాల్‌కోట కాశమన్న అతని పిల్లలు అఖిల్(13), కూతురు చైతన్యతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ చౌరస్తా సమీపంలో పెట్రోల్ బంకు దగ్గర వస్తుంటే వెనుక నుంచి నారాయణపేటకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న అఖిల్ బస్సు టైర్ కిందపడటంతో శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి మృతి చెందాడు. అదేవిధంగా చైతన్య తలకు, కాళ్లకు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి కాశమన్నకు సైతం గాయాలు అయ్యాయి. మృతదేహన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాశమన్న ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ పాపరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. సమాంతర కాల్వ ద్వారా 133 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 100, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

తాండ్ర పాఠశాలలో డీఈఓ విచారణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన విషయం విధితమే. దీంతో శుక్రవారం డీఈఓ గోవిందరాజులు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బాలరాజు పాఠశాలలో విచారణ చేశారు. పాఠశాలలో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేసి శాంపిల్‌ను సేకరించారు. దీంతో పాటు కందిపప్పును తీసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండేందుకు మహిళా కార్మికులను నియమించామని, పాడైన బియ్యం, కోడిగుడ్లు వంటకు వినియోగించకూడదని హెచ్చరించారు. బియ్యం నాణ్యతలో తేడా ఉంటే వెంటనే వెనక్కి పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల మెచ్ఎం కస్నానాయక్‌కు మెమో జారీ చేస్తున్నట్లు డీఈఓ చెప్పారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మాట్లాడుతూ బియ్యం నాణ్యతలో ఎలాంటి తేడా లేదన్నారు. బియ్యాన్ని శుభ్రపరచకుండా సరైన నీరు వాడకపోవడం వల్లే అన్నం ఉడకలేదని, అందుకే సమస్య వచ్చిందన్నారు. వంట సిబ్బంది జాగ్రత్తగా వంట చేయాలని సూచించారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత


ఎర్రవల్లిలో అదుపులోకి తీసుకున్న డీసీఎం

ఎర్రవల్లిచౌరస్తా: అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. అనంతపురం జిల్లా నుంచి డీసీఎంలో వనపర్తి జిల్లాకు 145 క్వింటాళ్ల (290 బ్యాగుల) పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గద్వాల విజిలెన్స్ అధికారి కేశవ్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బియ్యం పట్టివేత

మాగనూర్: మండలంలోని ఓబ్లాపూర్ స్టేజి వద్ద శుక్రవారం ఊట్కూర్ మండలం పగిడిమర్రిలో గాయత్రి రైస్ మిల్లు నుంచి రాయచూర్‌కు డీసీఎంలో 480 బస్తాల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సివిల్ సప్లయి డీటీ కాశప్ప తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బియ్యాన్ని మక్తల్‌లోని సివిల్ సప్లయి గోదాంలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఇవి పీడీఎస్ బియ్యమ లేక సీఎంఆర్ఎఫ్ బియ్యమా అంశంపై శాంపిల్ బియ్యంను పరీక్షల నిమిత్తం పంపించామని తెలిపారు.

పెళ్లింట తీవ్ర విషాదం

- విద్యుదాఘాతంతో వరుడి చెల్లి మృతి

గట్టు: మరో నాలుగు రోజులు గడిస్తే పెళ్లి బాజా భజంత్రీలు మోగాల్సి ఉంది. ఇంటిల్లిపాది పెళ్లి సందడిలో నిమగ్నమవ్వగా తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బల్గెరకు చెందిన దత్తురావు కుమార్తె శిరీష (20) శుక్రవారం రాత్రి ఇంటి దగ్గరున్న బోరు మోటారును ఆన్ చేయడానికి ప్లగ్‌ను బోర్డులో పెడుతున్న క్రమంలో విద్యుతాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను అయిజలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరో నాలుగు రోజుల్లో శిరీష సోదరుని వివాహారం అవ్వాల్సి ఉంది. కుటుంబ సభ్యులంతా పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమైన తరుణంలో విద్యుతాఘాతం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

వేలిముద్రతో రూ.10వేలు డ్రా

భూత్పూర్: మాయమాటలు చెప్పి వేలిముద్ర ద్వారా డబ్బులు కాజేసిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానకంటి లక్ష్మమ్మ గురువారం మధ్యాహ్నం ఇంటి పక్కనే ఉన్న మరొకరితో మాట్లాతూ ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మాటలు కలిపాడు. వృద్ధాప్య పింఛన్ రూ.2వేలు మీకు వస్తుందని, వచ్చే నెల నుంచి రూ.3వేల వచ్చేలా చేస్తానని నమ్మించాడు. దీంతో ఆమెను ఆధార్ కార్డు అడుగగా తీసిచ్చింది. ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న మిషన్‌లో ఆధార్ నంబరు నమోదు చేసి, మిషన్‌పై వేలిముద్ర పెట్టమని పెట్టించుకుని వెళ్లిపోయాడు. కాగా సాయంత్రం తన బంధువైన జంగిలయ్యకు విషయం చెప్పింది. శుక్రవారం భూత్పూర్‌లోని ఎస్‌బీఐ వద్దకు వచ్చి లక్ష్మమ్మ అకౌంట్ వివరాలు కనుక్కున్నారు. దీంతో రూ.10వేలు గురువారం డ్రా అయినట్లు తేలింది. మోసపోయామని గ్రహించిన బాధితులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ షాపులో పేలిన సిలిండర్



వనపర్తి క్రైం: మండలంలోని కడుకుంట్లలోని చికెన్ షాపులో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన ఉస్మాన్ చికెన్ సెంటర్‌లో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలడంతో షాపులో ఉన్న వస్తువులు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.


గౌతం జూనియర్ కాలేజ్ జట్టు


ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు

హోరా హోరీగా ఫైనల్స్

- 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ విన్నర్‌గా భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్టు
- జూనియర్ విజేతగా గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్, జూనియర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి.

సీనియర్ విభాగంలో ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ మహబూబ్‌నగర్, భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్లు రీజినల్ లెవల్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. డేవిడ్ 29 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ డిగ్రీ కాలేజ్ జట్టు 8.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 105 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రిజినల్ సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. జట్టులో నితీశ్ 32 బంతుల్లో 72 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.


భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టుకు కప్ అందజేస్తున్న 'సాక్షి'ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు

జూనియర్ విభాగంలో

గవర్నమెంట్ జూనియర్ కాలేజ్

(బాలురు) మహబూబ్‌నగర్, గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ జట్టు 9 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 5.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ జూనియర్ విన్నర్స్‌గా నిలిచారు. గౌతం క్రీడాకారుడు మనీశ్ 3 వికెట్లు తీయగా, అసిలేశ్ 7 బంతుల్లో 19 పరుగులు, అన్విత్ 10 బంతుల్లో 18 పరుగులు చేశారు. రీజినల్ విన్నర్స్, రన్నర్స్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విజేతలకు ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

రైతులకు ధాన్యం వ్యాపారి టోకరా

- రూ.2 కోట్లు ఎగవేత?
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధితులు
- పోలీసుస్టేషన్లలో రైతుల ఫిర్యాదు

బెల్లంపల్లి/తాండూర్/రెబ్బెన(ఆసిఫాబాద్): ధాన్యం విక్రయించిన రైతులను ఓ వ్యాపారి నిలువునా ముంచాడు. మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధిత రైతులు శుక్రవారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వ్యాపారి నల్ల రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలాల్లోని గ్రామాల్లో వంద మందికిపైగా రైతుల వద్ద ఖరీఫ్‌లో సుమారు రూ.2 కోట్లకుపైగా విలువైన వరి ధాన్యం కొనుగోలు చేశాడు. సీజన్ ప్రారంభంలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర చెల్లించాడు. దీంతో మిగతా రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడటంతో ధాన్యం విక్రయించారు. డబ్బులు కొద్ది రోజుల్లోనే చెల్లిస్తానంటూ గడువు విధిస్తూ వచ్చాడు. అయితే నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం, కొంతకాలంగా రమేష్ మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ రావడం, అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఒక్క రెబ్బెన మండలంలోని కిష్టాపూర్‌లో ఆరుగురు, రాజారాంలో నలుగురు, తక్కళ్లపల్లిలో సుమారు 17మంది రైతులు రెండు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం విక్రయించారు. ఈ మండలంలో సుమారు రూ.30లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా, మంచిర్యాల జిల్లా వెంకటాపూర్‌లో రూ.20 లక్షలు, రేచినిలో రూ.10 లక్షలు, మిగతా గ్రామాల్లో రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు బాధిత రైతుల ద్వారా తెలుస్తోంది. మోసపోయామని గ్రహించిన రైతులు మంచిర్యాల జిల్లా తాండూర్ సీఐ జగదీష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెబ్బెన, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేశారు.

కల్తీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ అంజనీకుమార్ వెల్లడించారు. 2014 నుంచి 2022 వరకు మొత్తం 991 కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాసిరకం విత్తనాల విక్రయానికి యత్నించిన 1,932 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 58 మందిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వరి | సాగు ఖర్చు రూ. 1,360... మద్దతు ధర రూ. 2,060

ఖర్చుకు తగినట్లు మద్దతు ధరలు

- కేంద్ర వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడి
- పత్తి ఖర్చు రూ. 4,050... మద్దతు ధర రూ. 6,080
- రైతులకు 50 శాతం ఆదాయం వస్తుందన్న కేంద్రం... 23 రకాల పంటలపై కేంద్ర ప్రభుత్వ విశ్లేషణ
- ఆ ధరలు సరిపోవంటున్న రాష్ట్ర ప్రభుత్వం... రైతులకు మద్దతు ధర పెంచాలని స్పష్టీకరణ
- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వరికి మద్దతు ధర రూ. 2,499 ఇవ్వాలని డిమాండ్
- పత్తికి రూ. 8,574, మొక్క జొన్నకి రూ.3,199 ఇవ్వాలంటున్న తెలంగాణ సర్కారు



సాక్షి, హైదరాబాద్: దేశంలో సాగు ఖర్చుకు మించి మద్దతు ధరలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 23 రకాల పంటల సాగుకు అయ్యే ఖర్చు ఎంత? వాటికి అందుతున్న మద్దతు ధర ఎంత అనే దానిపై తాజాగా ఒక అధ్యయన నివేదిక విడుదల చేసింది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) మేరకు సాగు ఖర్చులను దేశ వ్యాప్తంగా లెక్కలోకి తీసుకొని వీటి సరాసరిన నివేదికలో పొందుపరిచింది. 2022–23లో వరి ఉత్పత్తి ఖర్చు క్వింటాల్‌కు రూ. 1,360 ఉండగా, కనీస మద్దతు ధర రూ. 2,060గా కేంద్రం నిర్ధారించిన సంగతి తెలిసిందే. పత్తి ఉత్పత్తి ఖర్చు రూ. 4,053 ఉండగా, దాని మద్దతు ధర రూ. 6,080గా ఉంది. అలాగే మొక్కజొన్న సాగు, ఉత్పత్తి ఖర్చు రూ. 1,308 ఉండగా, దాని మద్దతు ధర రూ. 1,962గా ఉంది. కంది ఉత్పత్తి ఖర్చు రూ. 4,131 కాగా, మద్దతు ధర రూ. 6,600 ఉంది. ఇక సోయాబీన్ ఉత్పత్తి ఖర్చు ధర రూ. 2,805 కాగా, మద్దతు ధర రూ. 4,300 ఉంది. వేరుశనగ సాగు ఖర్చు రూ. 3,873 కాగా, 5,850గా ఉంది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం లాభం కలిగించేలా కనీస మద్దతు ధరలు నిర్ధారించినట్లు కేంద్రం తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇలా మూడేళ్ల సాగు ఖర్చు, వాటికిచ్చిన మద్దతు ధరల వివరాలను పొందుపరిచింది.

కేంద్రం వర్సెస్ రాష్ట్రం...

అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగు ఖర్చు వివరాలు, మద్దతు ధరలు శాస్త్రీయంగా లేవని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు పలుమార్లు రాష్ట్రంలోని పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు ఉండాలని కేంద్రాన్ని కోరింది. సాగు ఖర్చుకు మరో 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ ఇవ్వాలని సీఏసీపీకి ప్రతిపాదించింది. అందులో వివిధ పంటలకు ఎంతెంత ఖర్చు అవుతుందో వివరించింది. పంటల వారీగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటకోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ప్రతిఫలం అన్నీ కలిపి ఎంత ఖర్చు అవుతుందో సవివరంగా కేంద్రానికి నివేదించింది. ఒక వ్యాపారి తన వస్తువును అమ్ముకునేప్పుడు ధర ఎలా నిర్ణయిస్తారో, ఆ ప్రకారమే పెట్టిన పెట్టుబడి, దానికి అయ్యే వడ్డీలను లెక్కలోకి తీసుకొని సాగు ఖర్చును నిర్ధారించారు. ప్రతీ ఏడాది ఇలాగే శాస్త్రీయంగా సాగు ఖర్చు, ఎంఎస్‌పీ ఎలా ఉండాలో తెలంగాణ వ్యవసాయశాఖ ఇస్తూనే ఉంది. కానీ కేంద్రం తన పద్ధతిలో తాను ఎంఎస్‌పీని నిర్ధారిస్తూ పోతోందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

సాగు ఖర్చు నిర్ధారణలో శాస్త్రీయత లేదు



సాగు ఖర్చును అంచనా వేయడంలో కేంద్రానికి శాస్త్రీయమైన పద్ధతి లేదు. దేశంలో జిల్లాకో రకంగా సాగు ఖర్చు ఉంటుంది. దీంతో ఒకచోట ఎక్కువ ఒకచోట తక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం వేసిన సాగు ఖర్చు, దాని ప్రకారం మద్దతు ధర నిర్ధారణ సరిగా లేదు. దీంతో రాష్ట్రంలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఏసీపీకి పంపే నివేదికలకు ఏమాత్రం విలువ ఉండటం లేదు.

– డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణులు

వరి సాగు ఖర్చు ఎకరానికి రూ. 40 వేలు...

సాధారణ వరి రకం పండించేందుకు నారు మడి సిద్ధం చేయడం మొదలు విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపుతీత, చివరకు పంట కోత, కూలీల ఖర్చు, కుటుంబ సభ్యుల శ్రమ మొత్తం కలుపుకుంటే ఎకరానికి రూ. 40 వేలు ఖర్చు (24 క్వింటాళ్లు) అవుతున్నట్లు లెక్కగట్టింది. ఆ ప్రకారమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసింది. ఎకరా ఖర్చు ప్రకారం క్వింటా వరి పండించాలంటే రూ. 1,666 ఖర్చు అవుతుందని నిర్ధారణ చేసింది. స్వామినాథన్ కమిటీ సిఫా ర్సుల ప్రకారం సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ రూ. 2,499 ఇవ్వా లని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి ఎంఎస్‌పీ రూ. 2,060గా ఉండగా, అధికంగా పెంచాలని కోరుతున్నారు. అలాగే రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే పత్తికి కూడా ఎకరాకు రూ.40 వేలు ఖర్చుకానుంది. అయితే ఎకరాకు పత్తి ఏడు క్వింటాళ్లు పండుతాయి. కాబట్టి క్వింటాకు రూ. 5,714 ఖర్చు కానుంది. ఆ లెక్కన స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రూ. 8,574 పెంచాలని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం పత్తి మద్దతు ధర రూ. 6,080 మాత్రమే ఉండగా, మరో రూ. 2,491 వరకు పెంచాల్సి ఉంటుంది. జిల్లా.. జిల్లాకు సాగు ఖర్చులో తేడా ఉంటున్నందున దేశీయంగా ఒకేవిధమైన ఉత్పత్తి ఖర్చు అంచనా వేయలేమని, సరాసరిని లెక్కలోకి తీసుకోవడం తగదని పలువురు అంటున్నారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ. 32 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 15 క్వింటాళ్లు పండిస్తారు. అంటే క్వింటాకు రూ. 2,133 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 3,199 ఇవ్వాలని అంటున్నారు. కందికి రూ. 21 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 4 క్వింటాళ్లు పండుతుంది. అంటే క్వింటాలుకు రూ. 5,250 ఖర్చు వస్తుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 7,875 పెంచాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం దీనికి రూ. 6,600 మద్దతు ధర ఉంది. సోయాబీన్‌కు రూ. 32 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరానికి 5 క్వింటాళ్లు పండుతుంది. దీనికి క్వింటాలుకు రూ.6,400 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 9,600 చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

ఇంటరాగేషన్‌లో గాయాలు.. వ్యక్తి మృతి!

- మెదక్ పట్టణంలో చైన్ స్నాచింగ్
- అనుమానంతో ఖదీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విడిచిపెట్టాక అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిక.. చికిత్స పొందుతూ మృతి



ఖదీర్ భార్య, పిల్లలు.

చికిత్స పొందుతూ గాంధీలో మృతి చెందిన ఖదీర్

మెదక్ జోన్: చైన్ స్నాచింగ్ చేశాడనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి.. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు చిత్రహింసలు పెట్టి, ఇష్టం వచ్చినట్టుగా కొట్టారని.. దానితో కిడ్నీలు దెబ్బతిని మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. భర్త చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు పెట్టి, అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

అసలు ఏం జరిగింది?

మెదక్ పట్టణంలోని అరబ్ గల్లీలో జనవరి 27న గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ఆ దుండగుడు మహ్మద్ ఖదీర్ అని అనుమానించారు. మెదక్ పట్టణంలో చిన్న పాన్ షాపు నడుపుకొనే ఖదీర్.. అది సరిగా నడవకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో ఉంటూ కూలిపనులు చేసుకుంటున్నాడు. అతడి గురించి ఆరా తీసిన పోలీసులు జనవరి 29న హైదరాబాద్ వెళ్లి, సోదరి ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మెదక్ ఠాణాకు తరలించి ఐదు రోజులపాటు అదుపులో ఉంచుకున్నారు. ఏమీ తేలకపోవడంతో ఫిబ్రవరి 3న మెదక్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశారు.

దెబ్బలకు కిడ్నీలు దెబ్బతిని..

పోలీసులు వదిలేసిన తర్వాత ఖదీర్ తీవ్రంగా అస్వస్థతకు లోనయ్యాడు. ఫిబ్రవరి 6న మెదక్ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. పరీక్షలు చేసిన వైద్యులు బలమైన దెబ్బలు తగిలి కిడ్నీలు చెడిపోయాయని, మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దీనితో ఖదీర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మూడు రోజులు చికిత్స చేయించారు. ఈ ఖర్చులను పోలీసులే భరించారని ఖదీర్ భార్య తెలిపింది. కానీ ఖదీర్ పరిస్థితి విషమించడంతో ఫిబ్రవరి 12న గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 16న రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రే ఖదీర్ చనిపోయినా.. కేసు నమోదవకపోవడం, ఎఫ్ఐఆర్ కాకపోవడంతో మృతదేహానికి శుక్రవారం రాత్రి వరకు పోస్టుమార్టం చేయలేదు. దీనితో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశారు.

ఎస్సై, కానిస్టేబుళ్ల బదిలీ

ఖదీర్ మృతి నేపథ్యంలో మెదక్ పట్టణ ఎస్సై రాజశేఖర్‌ను డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ.. కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను రేగోడుకు, ప్రశాంత్‌ను పాపన్నపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

అకారణంగా నా భర్తను చంపేశారు

దొంగతనం నెపంతో తన భర్తను దారుణంగా కొట్టి చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని ఖదీర్ భార్య సిద్దేశ్వరి డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్తను అకారణంగా చంపి తనను, తన ముగ్గురు పిల్లలను రోడ్డున పడేసిన పోలీసులకు ఉసురు తగులుతుందంటూ ఆమె రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా.. హైదరాబాద్‌లోని తమ ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు దారుణంగా కొట్టారని, కాళ్లు మొక్కినా వినలేదని ఖదీర్ సోదరి తపసుల్ పేర్కొన్నారు.

పాత నేరస్తుడని అదుపులోకి..

''ఖదీర్ పాత నేరస్తుడు. అరబ్‌గల్లీలో ఓ మహిళ మెడలోంచి గొలుసు తెంపుకెళ్లిన వ్యక్తి సీసీ ఫుటేజీలో ఖదీర్‌లా ఉండటంతోనే అదుపులోకి తీసుకున్నాం. ప్రశ్నించిన తర్వాత ఫిబ్రవరి 3వ తేదీన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశాం. 6వ తేదీన అతడు ఆస్పత్రిలో చేరాడు. మధ్య ఏం జరిగిందో మాకు తెలియదు..''

– మెదక్ డీఎస్పీ సైదులు

మార్చి 25లోగా ఉపాధి పనుల పూర్తి

పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జీపీ భవనాల పనులను వచ్చేనెల 25 లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. మంజూరైన ఉపాధి పనులు, గ్రౌండింగ్ పనుల ప్రగతిపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోసమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌టీపీలో అప్లోడ్ చేస్తే నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కూలీలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

'సర్కార్ నౌకరి' సినిమా చిత్రీకరణ



సినిమాలోని ఓ సన్నివేశం చిత్రీకరణ

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట గ్రామంలో కృష్ణానది సమీపంలో సర్కార్ నౌకరి చిత్రం షూటింగ్ షూటింగ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గగమోని శేఖర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ చిత్రంలో హీరోగా ప్రముఖ గాయిని సునీత తనయుడు ఆకాష్, హీరోయిన్‌గా భావన వలపండల్ నటిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఈ చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు, కృష్ణానది పచ్చని అడవుల వంటి అందాలు, ఎంతో పురాతనమైన రామకీర్తలింగేశ్వరస్వామి ఆలయాల సమీపంలో షూటింగ్ చేస్తున్నామని తెలిపారు. రెండు రోజులపాటు ఇక్కడే షూటింగ్ ఉంటుందని చెప్పారు.

ఆకట్టుకుంటున్న బాలుడి ప్రతిభ



ఆకుపై శివుడి రూపం

కల్వకుర్తిరూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన బాలుడు యశ్వంత్ ఆకుపై మహాశివుడి రూపం తీర్చిదిద్దాడు. అదేవిధంగా చాక్‌పీస్‌తో త్రిశూలం తయారు చేశాడు. దీంతో బాలుడు పట్టణ ప్రజల మన్ననలు అందుకుంటున్నాడు.



చాక్‌పీస్‌తో త్రిశూలం

కేంద్ర జలశక్తి బృందం పర్యటన



నిజాలాపూర్ గ్రామస్తులతో చర్చిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం



రాజాపూర్ గ్రామస్తులతో సమావేశమైన కేంద్ర బృందం సభ్యులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని నిజాలాపూర్, కొమిరెడ్డిపల్లిలో శుక్రవారం ఇద్దరు సభ్యుల కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటించింది. కేంద్ర జలశక్తి శాఖలోని సెంట్రల్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త రేష్మా పిళ్లై, సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ హేమాధిత్యలు నిజాలాపూర్ వద్ద పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించి స్థానిక రైతులు, అధికారులతో మాట్లాడారు. చెక్‌డ్యాం ద్వారా భూగర్భ జలాలు ఏ విధంగా పెరిగి రైతులకు మేలు కలుగుతుందన్న దాని గురించి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి గుంతలు, హరితహారం, పల్లె ప్రకృతివనం వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. జలశక్తి అభియాన్ ద్వారా భూగర్భ జలమట్టం పెంచడానికి చేపట్టిన చర్యల గురించి పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో చర్చించారు. ఉపాధిహామీ పథకంలో వర్షం నీళ్లు వృథా కాకుండా చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. హరితహారంలో మొక్కల పెంపకం, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం, మిషన్ కాకతీయలో చెరువుల పూడికతీత పనుల గురించి కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం కొమిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. హార్టికల్చర్ అధికారులు తోటల గురించి బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ జకియాసుల్తానా, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, ఎంపీఓ సరోజ, సర్పంచ్ సత్యమ్మ, ఏఓ రాజేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్, అధికారులు ఉన్నారు.

రాజాపూర్ మండలంలో..

రాజాపూర్: మండలంలోని కల్లేపల్లి, గుండ్లపొట్లపల్లి, ముదిరెడ్డిపల్లిలో కేంద్ర బృందం పర్యటించి సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. కల్లేపల్లిలో పనులు చేసిన బిల్లులు రావడం లేదని సర్పంచ్ బాలమణి కేంద్ర బృందానికి తెలిపారు. పంచాయతీ ఆర్థిక వనరులు లేవని వారికి వివరించారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ శ్రీరాముప్ప, ఆర్ఎస్ యాదవ్, మోహిత్‌రావ్, డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ వెంకట్రాములు, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ పెంటయ్య ఉన్నారు.

ప్రయాణికుల ఫిర్యాదులను పరిశీలిస్తాం

- రీజనల్ మేనేజర్ శ్రీదేవి
- ఫిర్యాదుల స్వీకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్ఎంకు వచ్చిన ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బస్టాండ్ మధ్యలో ముఖ ద్వారం నుంచి లోపలికి రావడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, దారిని సరిచేయాలని కోరారు. బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాం 9 వనపర్తి బస్సుల పాయింట్ వద్ద దుర్గంధభరితమైన వాసన వస్తుందని, అదే విధంగా వాష్‌రూమ్‌లను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వడ్డేమాన్–ఆత్మకూర్ సర్వీసులను పెంచాలని, వేసవి రానున్న దృష్ట్యా మహబూబ్‌నగర్ పట్టణంలోని భగీరథకాలనీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని, కోస్గి డిపో నుంచి మద్దూర్, పల్లెర్ల మీదుగా కోస్గి వరకు బస్సు నడపాలని ప్రయాణికులు కోరారు. నవాబుపేట–కొత్తపల్లి నైట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని, మహబూబ్‌నగర్ బైపాస్ నుంచి భూత్పూర్ మీదుగా నాగర్‌కర్నూల్‌కు బస్సు నడపాలని, కల్వకుర్తి–హైదరాబాద్ బస్సును తెలకపల్లి, కార్వంగ మీదుగా నడపాలని ప్రయాణికులు కోరారు. మహబూబ్‌నగర్ నుంచి తాండూర్ వరకు అదనపు బస్సులు, కోస్గి డిపో నుంచి కోస్గి–పగిడ్యాల బస్సు నడపాలని ఫిర్యాదు చేశారు.

బొటానికల్ గార్డెన్‌లో తంగేడువనం



తంగేడు మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్, అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో తంగేడువనం పెంచుతున్నట్లు ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య శుక్రవారం తెలియజేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని గార్డెన్‌లో తంగెడు మొక్కలు నాటారు. రాష్ట్రంలో తంగేడు, జిల్లేడు మొక్కలు తగ్గిపోతున్నాయని, బతుకమ్మ సంబరాల్లో, ఇతర సంప్రదాయ కార్యక్రమాల్లో వీటి ని ఉపయోగిస్తామన్నారు. విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలో ఉన్నందువల్ల ప్రయోగాలు చేయటానికి మొక్కలు అవసరం అవుతాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ సతీష్ పాల్గొన్నారు.

అర్హత పొందలేక వెనక్కి..



సూచనలు ఇస్తున్న ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్

2,277మందిలో 961తుది పరీక్షకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రైం: దేహదారుఢ్య పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థుల్లో 60శాతం వరకు అర్హత సాధించలేక నిరాశతో వెనుతిరుగుతున్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు శుక్రవారం స్టేడియం గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మూడో రోజు పరీక్షలకు మహిళ, పురుషులు కలిపి 1,121మంది హాజరుకావాల్సి ఉండగా 940మంది హాజరుకాగా, తుది పరీక్షకు 371మంది అర్హత సాధించారు. పరీక్షలను ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్, ఎస్పీ నర్సింహ, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షించారు. మూడు రోజులుగా నిర్వహించిన పరీక్షల్లో 2,277మంది పాల్గొంటే 961మంది అభ్యర్థులు తుది పరీక్షకు ఎంపికయ్యారు. ఈనెల 21 వరకు పరీక్షలు కొనసాగనుండగా, ఇంకా 3,540 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది.



పరుగెడుతున్న అభ్యర్థులు


ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి

పాలమూరు: చట్టాలపై ఖైదీలు అవగాహన పెంచుకోవాలని, జైలు శిక్ష పూర్తయిన తర్వాత సత్ప్రవర్తనతో ఉంటూ ఉత్తమ జీవితం గడపాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని జిల్లా జైలును శుక్రవారం న్యాయమూర్తి సందర్శించి, ఖైదీలకు అందుతున్న నీరు, భోజనం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్, ఫ్రీ లీగల్ ఎయిడ్, పోక్సో యాక్ట్, లీగల్ సర్వీసెస్ అథారటీ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రఘుపతి, యోగేశ్వర్ రాజ్ యాదవ్, మల్లారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద ఆధునిక సీసీ కెమెరాలు



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో ఉన్న బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల దగ్గర ఆధునకి సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు అలారం సిస్టం బ్యాంకు లోపల, బయట అమర్చి అవసరమైన భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కె.నరసింహ సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో ఉన్న పలురకాల బ్యాంకు అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్యాంకు, ఏటీఎం కేంద్రాల్లో అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా కనిపించిన వెంటనే మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతతో ఏమైనా లోపాలు ఉంటే సవరించుకోవాలన్నారు. బ్యాంకు, ఏటీఎం కేంద్రాల దగ్గర పోలీస్ నిఘా పెంచుతామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.మహేష్ ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని 103వాహనాలు సీజ్

పాలమూరు: త్రైమాసిక పన్ను చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రవాణా శాఖ అధికారులు దృష్టి పెట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 103 నాన్ పేమెంట్ కేసులు నమోదు చేసి వాహనాలు అన్నింటిని సీజ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో 39 కేసులు, నారాయణపేటలో 16, గద్వాలలో 35, వనపర్తిలో 4, నాగర్‌కర్నూల్ జిల్లాలో 9కేసులు నమోదు చేశారు. డీటీసీ దుర్గా ప్రమీల మాట్లాడుతూ.. జనవరి 31లోపు ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాజమానులు త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. స్వచ్ఛందంగా వాహనదారులు పన్ను చెల్లించాలని, తనిఖీల్లో పట్టుబడితే పన్నుతో పాటు 100శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు.